ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ లో పిడుగుపడి మహిళ మృతి

- ఒకరి పరిస్థితి విషయం, ముగ్గురికి గాయాలు
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శ

హుజూర్‌నగర్, అక్టోబర్ 3 : హుజూర్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మున్సిపాలిటీ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద పశువులను మేపుతున్న పట్టణానికి చెందిన జక్కుల లక్ష్మి (52) పిడుగుపాటుకు అక్కడిక్కడే మృతి చెందింది. పొలంలో పనులు చేస్తున్న జక్కుల కవిత, జక్కుల లింగమ్మ, జక్కుల సత్యావతి, తండు స్వరూపకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ఏరియా దవాఖానకు తరలించారు. కవిత పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబాలను అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్ జక్కుల శంభయ్య, బీఆర్ఎస్ నాయకులు అమర్ నాథ్‌రెడ్డి ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం సాధించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

మునగాల : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

మునగాల, అక్టోబరు 3 : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం సాధించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామ పరిధిలోని పతంజలి ఆయిల్‌పామ్ నర్సరీలో వ్యవసాయ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం 10,500 ఎకరాలు అని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం కల్పించే రాయితీలపై రైతులకు వివరించాలన్నారు. అంతర పంటలుగా పత్తి, మిర్చి, బొప్పాయి, అరటి, బంతి, మిరియాలు, వంటి అనేక పంటలను ఆయిల్‌పామ్ తోటలో వేసుకోవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలైన నాటు కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం కూడా చేపట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏఓ రామారావునాయక్, జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం పట్టాభిరామ్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలి..

సూర్యాపేట : ఓటరు జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సూచించారు. ఐడీఓసీలో ఏర్పాటు చేసిన చెక్ యువర్ ఓట్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు.ప్రతి ఒక్క ఓటరు తమ ఓటును ఓటర్ జాబితాలో పరిశీలించుకునేందుకు జిల్లాలోని అన్ని తాసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో చెక్ యువర్ ఓట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటు లేనట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. సీపీఓ వెంకటేశ్వర్లు, ఎంప్లాయిమెంట్ అధికారి మాధవరెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్

అనంతగిరి, అక్టోబర్ 3 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. రెండో విడుత ఉపాధి హామీ సామాజిక తనిఖీ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు రూ.10.46 లక్షలు ఖర్చు అయినట్లు తెలిపారు. గత నెల 17 నుంచి ఈ నెల 2 వరకు సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి జరిమాన విధించామని, మస్టర్లలో సంతకాలు తీసుకోని సిబ్బందిని హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ప్రజా ధనం వృథా చేస్తే భవిష్యత్‌లో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటారని, విధులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విజయశ్రీ, అంబుడ్స్‌మెన్ లచ్చిరామ్, డీబీటీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఏపీలు శ్రీనివాస్‌రావు, శైలజ, సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు

గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు రాష్ట్ర సర్కారు ప్రోత్సాహం

11 రకాల ఆట వస్తువులతో కూడిన 698 కిట్ల సరఫరా

హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

గరిడేపల్లి మండలం పోనుగోడులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

నేరేడుచర్ల, అక్టోబర్ 3 : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి, యువతను క్రీడాకారులుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు యువతకు ఉపయోగపడేందుకు ఊరికో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ అందించేందుకు చర్యలు చేపట్టారు. సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల్లో 475 గ్రామ పంచాయతీలు, 204 అవాస గ్రామాలు ఉన్నాయి. మొత్తం 679 గ్రామాలతో పాటు హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, తిరమలగిరి, సూర్యాపేట మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటికి ప్రభుత్వం 698 స్పోర్ట్స్ కిట్లు సరఫరా చేయగా జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారులు ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీడీ కార్యాలయాల్లో భద్రపరిచారు. గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించారు. లాంగ్ జంప్, సింగిల్ బార్, డబుల్ బార్‌లను ఏర్పాటు చేసి యువత వ్యాయామం చేసేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. ప్రస్తుతం వ్యాయామంలో అవసరమైన సామాగ్రి డంబుల్స్ వంటి ఇతర క్రీడా సామాగ్రిని అందుబాటులోకి తెచ్చింది.

11 రకాల ఆటలకు 698 కిట్లు..

జిల్లాలోని 679 గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాల వారీగా పంపిణీ చేసేందుకు 11 రకాల ఆటలకు చెందిన 698 క్రీడా కిట్లను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసింది. వాటిని అధికారులు స్వీకరించి మండలాల వారీగా భద్రపరిచారు. ప్రతి క్రీడా ప్రాంగణానికి అవసరమైన టీషర్టులు, క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు, మెజరింగ్ టేబుల్, డంబుల్స్, డిస్కస్ త్రోలు, టెన్నీకాయిట్ రింగులు, స్కిప్పింగ్ రోప్‌లు, విజిల్స్, స్టాప్ వాచ్‌లతో పాటు ఇతర క్రీడా సామగ్రిని కిట్ల రూపంలో పొందుపరిచి సరఫరా చేశారు.

నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న స్పోర్ట్స్, కిట్లు

రిజర్వ్‌డ్‌లో 30 కిట్లు

జిల్లాలోని క్రీడా మైదానాలకు సరఫరా చేయగా అదనంగా 30 కిట్లు అందుబాటులో(రిజర్వ్‌డ్)లో ఉంచారు. ఇంకా కొన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలు పూర్తి కాకపోవడంతో వాటికి పంపిణీ చేయాల్సిన క్రీడా కిట్లను సైతం ముందస్తుగా అందుబాటులో ఉంచారు.

క్రీడాకారుల హర్షం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ఆడుకోవడానికి స్థలం లేక గతంలో నానా ఇబ్బందులు పడేవారు. సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వారికి ఉపయోగపడేలా గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడంతో పాటు 11 రకాల వస్తువులతో కూడిన క్రీడా కిట్లను పంపిణీ చేయడం ఎంతో సంతోషం ఉన్నదని పలువురు క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న రాములుగౌడ్

తుంగతుర్తి, అక్టోబర్ 3 : తుంగతుర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఈ నెల 5న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగనున్నట్లు గౌడ సంఘం నాయకుడు గుండగాని రాములుగౌడ్ తెలిపారు. మంగళవారం వెంపటి గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్ రావు, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ హాజరు అవుతున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గౌడ నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గౌడ సంఘం మండల నాయకులు, సర్పంచ్ అబ్బగాని పద్మాసత్యనారాయణ గౌడ్, అంజయ్యగౌడ్, మల్లయ్య, గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేశ్‌గౌడ్, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

అన్నదానం

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య

కోదాడటౌన్, అక్టోబర్ 3 : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకురి అంజయ్య, సెక్రటరీ కోట తిరుపయ్య, అన్నదాన నిర్వాహకులు వెంకట బ్రహ్మం, అనూరాధ, రాము, మాధవి, నవీన్‌కుమార్, దేవరశెట్టి హనుమంతరావు, కృష్ణమూర్తి, సత్యం, బ్యాటరీ చారి పాల్గొన్నారు.

నేడు మోతె మండల సర్వసభ్య సమావేశం

మోతె, అక్టోబరు 3 : బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విదేశీ ఉద్యోగాలకు 5న జాబ్ మేళా

సూర్యాపేట, అక్టోబర్ 3 : కెనడా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల్లో ఉద్యోగం చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణా మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కాయ్) ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమం చేపడుతున్నామని, ఈ జాబ్ మేళాతో అర్హత కలిగిన అభ్యర్థులు విదేశాల్లో ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. 1.బీఎస్సీ నర్సింగ్ (20 నుంచి 35 ఏండ్ల మధ్య), డిప్లొమా కోర్సులైన వెల్డర్, మెకానికల్, ప్లేయర్, ఫ్యాబ్రికేటర్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రూమెంటేషన్ (25 నుంచి 40 ఏండ్ల మధ్య), బీఈ, బీటెక్ సంబంధించి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ స్కెపోలింగ్, స్ట్రక్చరల్, హెచ్‌వీఏసీ డిజైన్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (వయస్సు 48 లోపు), ఐటీఐ ఫిట్టర్ విభాగంలో అసిస్టెంట్ మిషన్ ఆపరేటర్ (వయస్సు 30 ఏండ్ల లోపు) పోస్టులు ఉన్నట్లు, అర్హత కల్గిన అభ్యర్థులు ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయం నిర్వహించే జాబ్ మేళాకు సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

వేతన సవరణ కమిటీ సభ్యుడిగా మునగాల మండల వాసి

మునగాల, అక్టోబరు 3 : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన విశాంత్ర ఐఏఎస్ బుర్రి రామయ్యను రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీ సభ్యుడిగా నియమించింది. రామయ్య గతంలో వివిధ జిల్లాలకు కలెక్టర్‌గా, సీఎం కార్యాలయంలో ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ధరణి వెబ్‌సైట్ రూపకల్పనకు సలహాదారుగా పని చేశారు. నేడు పీఆర్సీ కమిటీ సభ్యుడిగా నియామకం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.